ప్రీతి డబుల్ ధమాకా

200 మీటర్ల రేసులోనూ కాంస్యం ● పారాలింపిక్స్‌లో వరుసగా రెండో పతకం ● బ్యాడ్మింటన్‌లో భారత్‌కు మూడు పతకాలు పక్కా

పారాలింపిక్స్‌లో రెండ్రోజుల క్రితమే కాంస్యంతో మెరిసిన పారా అథ్లెట్ ప్రీతి పాల్ ఆదివారం మరో పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మహిళల 200 మీటర్ల రేసులోనూ ఆమె కంచు మోత మోగించి క్రీడాభిమానుల ఆనందాన్ని రెండింతలు చేసింది. రెండ్రోజుల వ్యవధిలోనే రెండు పతకాలు కొల్లగొట్టిన ఆమె పారాలింపిక్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి పారా అథ్లెట్‌గా రికార్డులకెక్కింది. మరోవైపు బ్యాడ్మింటన్‌లో మన షట్లర్లు దేశానికి మూడు పతకాలు ఖాయం చేశారు.

ప్రీతి పాల్

పారిస్: రెండ్రోజుల క్రితమే మహిళల వంద మీటర్ల పరుగు పందెం (టీ35 కేటగిరీ)లో కాంస్యం గెలిచిన పారా అథ్లెట్ ప్రీతి పాల్ మరోసారి సంచలన ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన మహిళల 200 మీటర్ల (టీ35) రేసును 30.01 సెకన్ల లోనే పూర్తిచేసి వరుసగా రెండో కాంస్యాన్ని సొంతం చేసుకుంది. చైనా అమ్మాయిలు జియా ఝూ (28.15), క్వియాన్‌కిన్ (29.09) వరుసగా స్వర్ణ, రజతాలు కైవసం చేసుకున్నారు. ప్రీతి తృటిలో అగ్రస్థానంలో నిలిచే అవకాశాన్ని కోల్పోయింది. ఈ పతకం నెగ్గడం ద్వారా భారత్ నుంచి పారాలింపిక్స్ ఒకే ఎడిషన్‌లో రెండు మెడల్స్ గెలిచిన మూడో పారా క్రీడాకారిణిగా ప్రీతి రికార్డులకెక్కింది. అంతకుముందు టోక్యో ఒలింపిక్స్‌లో షూటర్ అవని లేఖరా, మరో షూటర్ సింగ్‌రాజ్ అధన ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు సాధించినవారిలో ఉన్నారు. అయితే ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో మాత్రం ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్ ప్రీతి మాత్రమే.

నితేశ్ సుహాస్

బ్యాడ్మింటన్‌లో మూడు పతకాలు పక్కా: పురుషుల సింగిల్స్ (ఎస్‌ఎల్3) సెమీస్‌లో కుమార్ నితేశ్.. 21-16, 21-16తో పుజిహర (జపాన్)ను ఓడించి ఫైనల్స్‌కు చేరాడు. మరో ఈవెంట్ పురుషుల సింగిల్స్ (ఎస్ ఎల్4) సెమీస్‌లో సుహాస్ యతిరాజ్ 21-17, 21-12తో భారత్‌కే చెందిన సుకాంత్ కదమ్‌ను ఓడించి గోల్డ్ మెడల్ మ్యాచ్‌కు అర్హత సాధించాడు. ఈ ఇద్దరూ ఫైనల్స్‌లో గెలిస్తే దేశానికి రెండు స్వర్ణాలు అందించే అవకాశం ఉండగా ఓడినా కనీసం రజతాలు అయితే భారత్ ఖాతాలో చేరనున్నాయి. మహిళల విభాగాల్లోనూ భారత్‌కు పతకం దక్కే విజయాలే నమోదయ్యాయి. మహిళల సింగిల్స్ (ఎస్‌యూ5) క్వార్టర్స్ పోరులో మనీష రామదాస్ 21-13, 21-16తో మమికొ టొయొడ (జపాన్)ను ఓడించి సెమీస్ పోరుకు అర్హత సాధించింది. సెమీస్‌లో ఆమె భారత్‌కే చెందిన తులసిమతి మురుగేశన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ పోరులో గెలిచిన విజేత ఫైనల్స్‌కు చేరనుండగా ఓడిన వాళ్లు కాంస్య పోరులో ఆడతారు. మహిళల సింగిల్స్ (ఎస్‌హెచ్6) క్వార్టర్స్‌లో నిత్య శ్రీ సివన్ 21-4, 21-7తో ఒలివియా (పోలండ్)ను ఓడించి సెమీస్‌కు చేరింది.

కాంస్య పోరులో ఓడిన రాకేశ్

ఆర్చరీ పురుషుల వ్యక్తిగత కాంపౌండ్‌లో ఒక్కో మెట్టు ఎక్కుతూ కాంస్య పోరుకు అర్హత సాధించిన రాకేశ్ తృటిలో పతకాన్ని కోల్పోయాడు. కాంస్య పోరులో అతడు 146-147తో హి జిహావో చేతిలో ఓటమిపాలయ్యాడు. ఒక్క పాయింట్ తేడాతో రాకేశ్ కాంస్యం చేజార్చుకోవడం గమనార్హం. అంతకుముందు సెమీస్‌లో రాకేశ్ 143-145తో జిన్లియాంగ్ (చైనా) చేతిలో ఓడి కాంస్య పోరుకు అర్హత సాధించాడు.

షూటింగ్‌లో నిరాశ

రెండు రోజుల్లోనే దేశానికి నాలుగు పతకాలు అందించిన షూటర్లు ఆదివారం మాత్రం నిరాశపరిచారు. పారిస్‌లో ఇదివరకే పది మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్‌లో స్వర్ణం నెగ్గిన అవని లేఖరా ఆదివారం జరిగిన పది మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ (ఎస్‌హెచ్1) మిక్స్‌డ్ ఈవెంట్ క్వాలిఫికేషన్‌లో 11వ స్థానంలో నిలిచింది. ఇదే ఈవెంట్ మిక్స్‌డ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ప్రోన్ (ఎస్‌హెచ్2)లో శ్రీహర్ష రామకృష్ణ 26వ స్థానంలో నిలిచాడు. క్వాలిఫికేషన్ రౌండ్స్‌లో టాప్8 లో నిలిచినవారే ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు.

మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో భారత క్రికెటర్లు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా వేదికగా జరుగబోయే ప్రతిష్టాత్మక మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో ఆరుగురు భారత క్రికెటర్లు ఆడనున్నారు. ఆదివారం వేలం ప్రక్రియ ముగియడంతో ఎవరెవరు ఏ జట్టుకు ఆడతారనేదానిపై స్పష్టత వచ్చింది. టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అడిలైడ్ స్ట్రైకర్స్‌కు ఆడనుండగా దయాలన్ హేమలత పెర్త్‌కు ప్రాతినిధ్యం వహించనుంది. యస్తికా భాటియా, దీప్తి శర్మ మెల్‌బోర్న్ స్టార్స్ తరఫున బరిలోకి దిగనుండగా ఆల్‌రౌండర్ శిఖా పాండే, స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ బ్రిస్బేన్ హీట్‌కు ఆడనున్నారు.

కాబోయే అమ్మకు కాంస్యం

కడుపులో ఏడు నెలల చిన్నారితో పారాలింపిక్స్ బరిలోకి దిగిన ఇంగ్లండ్ మహిళా పారా ఆర్చర్ జోడీ గ్రిన్హమ్ కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించింది. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో గ్రిన్హమ్ 142-141 స్కోరుతో తన ప్రత్యర్థి పీటర్సన్ పైన్‌ను ఓడించింది. తద్వారా ఈ పారాలింపిక్స్‌లో పతకం గెలిచిన తొలి గర్భిణీగా రికార్డులకెక్కింది. 2016లో ఆమె రజతం నెగ్గింది.

జగన్‌మోహన్‌రావుకు ప్రతిష్టాత్మక పురస్కారం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావుకు ఢిల్లీకి చెందిన స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ఏడాదికి గాను 'బెస్ట్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్'గా జగన్‌మోహన్‌రావుకు అవార్డు దక్కింది. హ్యాండ్‌బాల్, క్రికెట్‌తో పాటు పలు క్రీడాంశాల్లో క్రీడాకారులకు ఆయన అందిస్తున్న ప్రోత్సాహం, క్రీడారంగ అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించిన ఫౌండేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది.

బంగ్లాను ఆదుకున్న లిటన్ దాస్

● **రాణించిన మెహిది హసన్ మిరాజ్**

రావల్పిండి: పాకిస్థాన్‌తో రావల్పిండి వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో బంగ్లాదేశ్ పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ లిటన్ దాస్ (138) అద్భుత శతకానికి తోడు మెహిది హసన్ మిరాజ్ (78) సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆదుకోవడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 262 పరుగులకు ఆలౌట్ అయింది. ఒకదశలో 26 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన బంగ్లా ఇక్కడిదాకా వచ్చిందంటే అది లిటన్, మిరాజ్ పోరాటమే. పాకిస్థాన్ యువ పేస్ సంచలనం ఖుర్రం షాజాద్ (6/90) ఆరు వికెట్లతో బంగ్లా టాపార్డర్‌ను కుప్పకూల్చాడు. పర్యాటక జట్టు ఆలౌట్‌తో 8 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని దక్కించుకున్న పాకిస్థాన్.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 3.4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (3), నైట్ వాచ్‌మెన్ ఖుర్రంను హసన్ మహ్మూద్ పెవిలియన్‌కు పంపాడు.

ఇంటర్ కాంటినెంటల్ కప్‌నకు సర్వం సిద్ధం

పాల్గొననున్న భారత్, సిరియా, మారిషస్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలోని జీఎంసీ బాలయోగి స్టేడియం మరో అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి ఆతిథ్యమివ్వబోతోంది. ఈ నెల 3 నుంచి 9 దాకా హైదరాబాద్ వేదికగా భారత్, మారిషస్, సిరియా ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ కప్-2024 ఆడనున్నాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) సమన్వయంతో ఈ టోర్నీని నిర్వహించనున్నాయి. ఫుట్‌బాల్‌లో హైదరాబాద్ నగరానికి ఉన్న ఘనమైన వారసత్వం దృష్ట్యా మళ్లీ ఈ క్రీడలో పునర్‌వైభవం తీసుకొచ్చేందుకు ఇంటర్ కాంటినెంటల్ కప్‌ను నిర్వహించనున్నట్టు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేనారెడ్డి అన్నారు. ఈ టోర్నీని సజావుగా నిర్వహించేందుకు స్టేడియంలో అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసినట్టు ఆయన తెలిపారు. టోర్నీలో భాగంగా భారత్.. ఈనెల 3న మారిషస్‌తో 9న సిరియాతో తలపడనుంది. మారిషస్, సిరియా మధ్య 6న మ్యాచ్ జరుగనుంది.

ఇంగ్లండ్‌దే రెండో టెస్టు

లండన్: స్వదేశంలో శ్రీలంకతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను ఇంగ్లండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో చేజిక్కించుకుంది. లార్డ్స్ వేదికగా జరిగిన రెండో టెస్టులో 482 పరుగుల భారీ ఛేదనలో లంకేయులు 292 పరుగులకే ఆలౌట్ అవడంతో ఇంగ్లీష్ జట్టు 190 పరుగుల తేడాతో గెలుపొందింది. లంక తరఫున చండిమల్ (58), కరుణరత్నె (55), ధనంజయ డిసిల్వ (50) రాణించారు. గస్ అట్కిన్సన్ (5/62) దెబ్బకు లంక బ్యాటర్లు విలవిల్లాడారు.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	30	25	11	66
2	బ్రిటన్	23	12	8	43
3	బ్రెజిల్	8	4	14	26
4	అమెరికా	6	10	8	24
5	ఫ్రాన్స్	6	8	10	24
6	ఆస్ట్రేలియా	6	6	9	21
29	భారత్	1	1	4	6

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

ప్రిక్వార్టర్స్‌కు సిన్నర్, స్వియాటెక్

న్యూయార్క్: టాప్ సీడ్‌లంతా ఒక్కొక్కరుగా వెనుదిరుగుతున్న యూఎస్ ఓపెన్‌లో ఇటలీ కుర్రాడు జన్నిక్ సిన్నర్ మాత్రం తన జోరు కొనసాగిస్తున్నాడు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ పోరులో ఒకటో సీడ్ సిన్నర్ 6-1, 6-4, 6-2తో క్రిస్ ఒ కనెల్ (ఆస్ట్రేలియా)ను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. గంటా 53 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో సిన్నర్ 15 ఏస్‌లు సంధించగా 46 విన్నర్లు కొట్టాడు. గత రెండు రౌండ్‌లలో ఆరంభంలో కాస్త ఇబ్బందిపడ్డ సిన్నర్ ఈ మ్యాచ్‌లో మాత్రం ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించాడు. మరో మ్యాచ్‌లో డేనియల్ మెద్వెదేవ్ (రష్యా) 6-3, 6-4, 6-3తో ఫ్లేవియో కొబొలి (ఇటలీ)ని వరుస సెట్లలో చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. యూఎస్ ఓపెన్ టాప్-10 సీడెడ్ ఆటగాళ్లలో సిన్నర్, మెద్వెదేవ్, జ్వెరెవ్ మాత్రమే ప్రిక్వార్టర్స్‌కు చేరడం గమనార్హం.

స్వియాటెక్, సబలెంక దూకుడు

మహిళల సింగిల్స్‌లో పోలండ్ సంచలనం ఇగా స్వియాటెక్‌తో పాటు బెలారస్ భామ అరీనా సబలెంక, ఇటలీ చిన్నది జాస్మిన్ పలోని ప్రిక్వార్టర్స్ చేరారు. మూడో రౌండ్‌లో స్వియాటెక్ 6-4, 6-2తో పవ్యూచెంకోవాను చిత్తుచేసింది. సబలెంక 6-2, 6-1, 6-2తో అలగ్జాండ్రోవను ఓడించగా వొజ్నియాకి 6-3, 6-2తో జెస్సిక పంచెట్ (ఫ్రాన్స్)పై గెలిచింది. కోకో గాఫ్, స్వియాటెక్, పలోని, సబలెంక, జెంగ్ వంటి స్టార్ ప్లేయర్లు ప్రిక్వార్టర్స్ చేరడంతో పోరు రసవత్తరం కానుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న జపాన్ సహచరిణి అల్లిల ద్వయం 0-6, 7-6 (7/5), 10-7తో జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా), కటెరిన సినియాకొవ (చెక్ రిపబ్లిక్)ను ఓడించి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.